సాక్షి
ప్రకాశం
శుక్రవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2024



భళారే.. కళారం
దసరా ఉత్సవాల్లో భాగంగా ఒంగోలు నగరంలో కళారాల ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. కన్నుల పండువగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు భక్తులు పోటెత్తారు. - IIలో..



చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి
చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
36/27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

కిక్కు.. రివర్స్..

- టీడీపీ నేతల తీరుతో రీచ్‌కాని టార్గెట్
- జిల్లాలో 171 మద్యం దుకాణాలకు 5,130 దరఖాస్తులు వస్తాయని అంచనా
- వచ్చింది కేవలం 2,360 దరఖాస్తులే
- దరఖాస్తుల సంఖ్య పెంచాలంటూ అధికారులపై ఒత్తిడి
- 10 దరఖాస్తుల్లోపు వచ్చిన దుకాణాలకు మళ్లీ నోటిఫికేషన్
- అధికార పార్టీ ఎమ్మెల్యేల బెదిరింపులే కారణం
- 20 శాతం వాటా డిమాండ్ చేస్తున్న వైనం

టీడీపీ నేతల తీరుతో మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియలో సీన్ రివర్స్ అయింది. ప్రభుత్వం ఒకటి తలిస్తే.. ఆ పార్టీ నాయకుల బెదిరింపులతో మద్యం వ్యాపారులు దూరంగా ఉండిపోయారు. కేవలం టీడీపీ నేతలు, వారి మద్దతుదారులు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నట్టు సమాచారం. నిర్దేశించిన లక్ష్యం మేరకు దరఖాస్తులు రాక పోవడంతో రెండు రోజులు గడువు పొడిగించినా ఫలితం కనిపించలేదు. జిల్లాలో కనీసం 50 శాతం కూడా దాటలేదు. దీంతో పదిలోపు దరఖాస్తులు వచ్చిన వాటికి మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామంటూ ఎక్సైజ్ అధికారులు ప్రకటిస్తుండటం వాస్తవ పరిస్థితికి అద్దంపడుతోంది.



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 1వ తేదీ కూటమి ప్రభుత్వం మద్యం నూతన పాలసీకి నోటిఫికేషన్ జారీ చేసింది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. తొలుత 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం అనుకున్న ప్రకారం దరఖాస్తులు రాకపోవడంతో మరో రెండు రోజుల పాటు గడువు పెంచింది. శుక్రవారంతో పెంచిన గడువు కూడా ముగియనుంది. మొత్తం దుకాణాలకుగానూ 5,130 దరఖాస్తులు వస్తాయని అంచనా వేసింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే.. ప్రభుత్వం ఊహించినంతగా దరఖాస్తులు రాలేదు. అందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేల బెదిరింపులే కారణమన్న ప్రచారం జరుగుతోంది. ఎవరు పడితే వారు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేయవద్దని, ఒకవేళ దరఖాస్తు చేసినా వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామంటూ అనుచరుల ద్వారా హెచ్చరికలు పంపించారు. దాంతో మద్యం వ్యాపారులు భయాందోళనకు గురయ్యారు. చేతిలో ఉన్న డబ్బు వృథా చేసుకోవడం ఎందుకంటూ దరఖాస్తు చేయలేదు. దీంతో అసలుకే ఎసరు వచ్చింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఎక్కడికక్కడ విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ధైర్యంగా దరఖాస్తు చేసుకోమంటూ మద్యం వ్యాపారులను కోరుకునే పరిస్థితి ఏర్పడింది.

సగం టార్గెట్ కూడా పూర్తి కాలేదు...
జిల్లాలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ప్రభుత్వ టార్గెట్ పూర్తి కావడం అంత సులువు కాదనిపిస్తోంది. ఒంగోలు నగరం, రూరల్ కలుపుకుని మొత్తం 34 మద్యం దుకాణాలు ఉండగా, గురువారం నాటికి 415 దరఖాస్తులు వచ్చాయి. చీమకుర్తి మండలంలో 16 మద్యం దుకాణాలకు 265, సింగరాయకొండ పరిధిలోని 14 దుకాణాలకు 294, పొదిలి పరిధిలోని 16 దుకాణాలకు 140, దర్శి పంచాయతీ, రూరల్ కలుపుకుని 23 దుకాణాలు ఉండగా 231 దరఖాస్తులు వచ్చాయి. ఒంగోలు డివిజన్ పరిధిలో 103 మద్యం దుకాణాలు ఉండగా, 1,345 దరఖాస్తులు వచ్చాయి. ఇక మార్కాపురం డివిజన్లోని 68 దుకాణాలకు 1015 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ డివిజన్‌లో మార్కాపురం మున్సిపాలిటీ, రూరల్ కలిపి 13 మద్యం దుకాణాలకుగానూ 227 మంది దరఖాస్తు చేసుకున్నారు. కనిగిరి పరిధిలోని 19 దుకాణాలకు 264, గిద్దలూరు పరిధిలోని 13 దుకాణాలకు 174, కంభం పరిధిలోని 10 దుకాణాలకు 191, యర్రగొండపాలెం పరిధిలోని 13 దుకాణాలకుగానూ 159 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో మొత్తం 171 దుకాణాలకుగానూ 2,360 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

భారీగా తగ్గిన దరఖాస్తులు...
గత రెండు రోజులుగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే దరఖాస్తుల సంఖ్య భారీగా తగ్గినట్లు చెప్పవచ్చు. జిల్లాలోని రెండు డివిజన్లను కలుపుకుని మంగళవారం నాటికి మొత్తం 1,472 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం ఆ సంఖ్య 2,077కి పెరిగింది. అంటే కేవలం 650 దరఖాస్తులు మాత్రమే పెరిగాయి. ప్రభుత్వం గడువు పెంచినప్పటికీ గురువారం కేవలం 283 దరఖాస్తులే రావడం గమనార్హం. టార్గెట్ 5,130 ఉండగా, ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా 2,360 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అంటే సగానికి సగం దరఖాస్తులు కూడా రాలేదు.

ప్రభుత్వాదాయానికి భారీగా గండికొట్టిన ఎమ్మెల్యేలు...
మద్యం షాపులకు దరఖాస్తుల ద్వారా జిల్లాలో రూ.105 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. తాజా పరిస్థితిని పరిశీలిస్తే సగం ఆదాయం కూడా వచ్చే పరిస్థితి కానరావడం లేదు. దీనికి కారణం టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలే అని ప్రచారం జోరుగా సాగుతోంది. మద్యం వ్యాపారంలో జోక్యం చేసుకోవడమే కాకుండా ఇది మా ప్రభుత్వం, మేము మాత్రమే మద్యం వ్యాపారం చేయాలంటూ హుకుం జారీ చేయడం తలనొప్పిగా మారింది. దాంతో ఎందుకొచ్చిన గొడవలే అంటూ మద్యం వ్యాపారులు తప్పుకున్నారు. కొత్త వ్యాపారులు భయపడ్డారు. మధ్యలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చివరికి ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడింది.

10లోపు దరఖాస్తులు వచ్చిన షాపులకు రీ నోటిఫికేషన్...
జిల్లాలో 171 దుకాణాలున్న సంగతి తెలిసిందే. దీంతో దరఖాస్తుల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి పెంచింది. జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు తమ పోలీసుస్టేషన్ల పరిధిలో విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేయడం గమనార్హం. మార్కాపురం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఈఎస్ దాసరి బాలయ్య మాట్లాడుతూ 10 దరఖాస్తుల్లోపు వచ్చిన దుకాణాలకు రీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పడం గందరగోళాన్ని సృష్టిస్తోంది. జిల్లాలో 19 దుకాణాలకు 1 నుంచి 9 వరకు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఒక్కో దుకాణానికి 30 దరఖాస్తులు వస్తాయని ఊహించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఊహించని ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. ఏఈఎస్ చెప్పినట్లే ఈ దుకాణాలకు రీ నోటిఫికేషన్ ఇస్తారో లేదో వేచిచూడాలి.

అవినీతి సిబ్బందిపై క్రిమినల్ చర్యలకు సిపార్సు

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన సిబ్బందిలో ఎంపీ కిషోర్‌బాబుని ఇప్పటికే సస్పెండ్ చేయగా, డిజిటల్ అసిస్టెంట్‌గా గతంలో పనిచేసిన పి.సాయికోటేశ్వరరావును గురువారం సస్పెండ్ చేశారు. వీరితోపాటు కార్యాలయ పూర్వపు పరిపాలనాధికారి ఎస్.శివప్రసాద్‌పై అవినీతి నిరోధక చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సిబ్బంది సాధారణ బదిలీల్లో అవినీతికి పాల్పడినందుకు క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు డీపీవో పేర్కొన్నారు.

22న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాత జెడ్పీ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

భైరవకోనలో హీరో శ్రీకాంత్ పూజలు



చండీహోమంలో పాల్గొన్న సినీహీరో శ్రీకాంత్, పలువురు నటులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను గురువారం సినీహీరో శ్రీకాంత్‌తో, పలువురు నటులు సందర్శించారు. తొలుత త్రిముఖ దుర్గాదేవి, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం చండీహోమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జలపాతాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు వెంకట నరసయ్య, రామమూర్తి, సుధాకర్‌శర్మ ఆయనకు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ. డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు స్వామి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించారు.

విజిలెన్స్ సీఐగా అపర్ణ



విజిలెన్స్ సీఐ అపర్ణ (ఫైల్)

ఒంగోలు టౌన్: విజిలెన్స్ సీఐగా నూతలపాటి అపర్ణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె గురువారం ఒంగోలు విజిలెన్స్ విభాగంలో జిల్లా ఆర్వీఈఓ జె. కులశేఖర్‌కు రిపోర్ట్ చేశారు. ప్రస్తుతం ఆమె ఒంగోలు ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

రెండు ఆటోలు చోరీ

ఒంగోలు టౌన్: నగరంలోని నడిబొడ్డున రెండు ఆటోలు చోరీకి గురయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..నగరంలోని ఇందిరా కాలనీకి చెందదిన దార్ల వెంకటేశ్వర్లు, వల్లెపు అంజయ్యలు ఆటోలు తోలుకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. రోజూ బాడుగలు తోలుకున్న తరువాత రాత్రి వేళలో ఆటోలను అంబేడ్కర్ భవనం ఎదుట నిలిపి తాళం వేసి ఉంచుతారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి ఆటోలను నిలిపి ఉంచి ఇంటికెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా రెండు ఆటోలు కనిపించలేదు. చుట్టుపక్కల విచారించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వై .నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భళారే.. కళారం..



పార్వతీదేవి కళారం

- అంగరంగ వైభవంగా వందేళ్ల ఉత్సవం
- తొలిరోజు కోలాహలంగా మూడు కళారాల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- నేడు మరో మూడు కళారాల ఊరేగింపు



బాలాత్రిపురసుందరీదేవి కళారం



మహిషాసురమర్దిని కళారం

ఒంగోలు మెట్రో:

దసరా ఉత్సవాల్లో కళారాల సంబరం ఒంగోలుకు ప్రత్యేకం. మైసూరు, కోల్‌కతా తర్వాత ఇక్కడే ఈ ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. రక్తబీజుడిని హతమార్చిన కాళికామాత రౌద్రరూపంలో ఊరేగింపునకు బయలుదేరుతుంది. భక్తుల కోలాహలం, డప్పు వాయిద్యాలు, వివిధ రకాల వేషధారణల నడుమ నడిరేయి ఆరంభమయ్యే ఈ సంబరాలు అంబరాన్ని అంటుతాయి. దుష్టశిక్షణ పూర్తిచేసుకుని వస్తున్న అమ్మవారికి జయజయధ్వానాలతో భక్తజనం స్వాగతం పలుకుతారు. ఏటా దుర్గాష్టమి, నవమి దినాల్లో నగరంలోని ఆరు దేవస్థానాల నుంచి అమ్మవారి కళారాలను ఊరేగిస్తారు. వందల ఏళ్లుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. గురువారం రాత్రి ఉత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి.

వందేళ్లుగా...


ఒంగోలులో జరిగే కళారాల ఉత్సవానికి వందలాది సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో చిన్న గూడు బండ్లు కట్టుకుని అమ్మవారి కళారాన్ని ఊరేగిస్తూ తప్పెట్లు వాయిస్తూ కాగడాలు పట్టుకుని అర్ధరాత్రి నుంచి నగరం మొత్తం తిరిగేవారు. తెల్లవారే వరకు ఈ సందడి కొనసాగేది. ఎంత రాత్రయినా సరే తమ వీధిలోకి వస్తున్న కళారాన్ని చూసి అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి కర్పూర హారతులు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు అందుకునేవారు. ఇప్పటి కాలంతో పాటు ఉత్సవ తీరులోనూ ఆధునికత చోటుచేసుకుంది. అదిరిపోయే డీజే, బాణసంచా శబ్దాలతో దేవాలయాల నుంచి వీధుల్లోకి ఊరేగింపుగా వచ్చే అమ్మవారి కళారాన్ని దర్శిస్తే మళ్లీ ఏడాది వరకు ఎలాంటి దుష్టశక్తుల పీడ, ఈతి బాధలు ఉండవని భక్తుల నమ్మకం.

భక్తుల కొంగుబంగారం ఆరు కళారాలు...


ఒంగోలు నగరంలో మొత్తం ఆరు కళారాలు ఉన్నాయి. స్థానిక బాలాజీరావుపేటలో కనకదుర్గాదేవి, గంటాపాలెంలో పార్వతీదేవి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర బాలాత్రిపురసుందరీదేవి, నరసింహస్వామి, ఏనుగు చెట్టు దగ్గర ఉన్న అంకమ్మపాలెం కాళికాదేవి, కేశవస్వామిపేటలోని మహిషాసురమర్ది కళారాలు ఉన్నాయి. నాలుగు కళారాలు పసుపు వర్ణంతో, అంకమ్మపాలెంలోని కాళికాదేవి ఎర్రగా, నరసింహస్వామి తెల్లగా ఉంటారు. కళారాల ఉత్సవం అద్భుత వీక్షణ దుర్గాష్టమి గురువారం రోజు ప్రారంభమైంది. అంకమ్మపాలెం కాళికాదేవి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర బాలాత్రిపురసుందరీదేవి, బాలాజీరావుపేటలోని కనకదుర్గమ్మ నగర ఉత్సవానికి బయలుదేరారు. శుక్రవారం గంటాపాలెంలోని పార్వతీ అమ్మవారు, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోం దగ్గర ఉన్న నరసింహస్వామి, కేశవస్వామిపేటలోని మహిషాసురమర్దిని నగర ఉత్సవానికి బయలుదేరతారు. నగరంలోని వేరువేరు మార్గాలలో పయనించి శుక్రవారం, శనివారం తెల్లవారుజామున మస్తాన్ దర్గాసెంటర్ వద్ద కళారాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు .

కళారం అంటే...

ఒకసారి రక్తబీజుడు అనే రాక్షసుడితో అమ్మవారు యుద్ధం చేయాల్సి వస్తుంది. అతని శిరస్సును ఖడ్గంతో ఖండిస్తుంది. రక్తం ధారలుగా నేల మీద కారుతుంది. ప్రతి రక్తపు చుక్క నుంచి మళ్లీ ఒక రక్తబీజుడు పుట్టుకు వస్తాడు. బ్రహ్మదేవుడు ఆ రాక్షసుడికి ఇచ్చిన వరంతో అమ్మవారితో యుద్ధం చేస్తూ పోటీగా నిలబడతాడు. అమ్మవారు తన శక్తి నుంచి నల్లని కాళీ రూపాన్ని సృష్టించి కాళికాదేవిగా పెద్ద నాలుకతో రక్తబీజుడి నుంచి కారే ప్రతి రక్తపు బొట్టును భూమి మీద పడకుండా తాగేస్తూ ఆ రాక్షసుడి శక్తిని హరించి అంతం చేస్తుంది. అప్పుడు ప్రజలంతా కాళికామాతకు జయజయ ధ్వానాలు పలికి అమ్మవారిని తమ మధ్య ఉండిపోవాలని కోరగా.. దానికి అమ్మవారు ×అలా కుదరదు.. ముల్లోకాల రక్షణ బాధ్యత నాదే కదా.. మీ కోరిక ప్రకారం ప్రజలందరికీ దుష్టశక్తుల భయం లేకుండా నా అంశంతో నిబిడీకృతమైన కళారాన్ని (నోరు తెరిచి ఉంచే శిరస్సు భాగం) ప్రసాదిస్తున్నాను.. దాని రూపాన్ని పూజించి ఆరాధించండి.. దసరా నవరాత్రుల్లో దుర్గాష్టమి, మహర్నవమి రోజుల్లో అర్ధరాత్రి కళారాన్ని నగర సంచారం చేయించండి.. నగరంలోని దుష్టశక్తులన్నీ పారిపోతాయి× అని అభయమిస్తుంది. విష్ణుమూర్తి తత్వమైన నరసింహస్వామి కూడా కళారంగా వచ్చి మిమ్మల్ని తరింపజేస్తాడని అమ్మవారు వరమిస్తుంది. ఆ విధంగా ప్రారంభమైనదే మన కళారాల చరిత్ర



కాళికాదేవి కళారం



నరసింహస్వామి కళారం



కనకదుర్గమ్మ కళారం

చెంచుల జీవన ప్రమాణాలు

మెరుగుపరిచేందుకు కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



చెంచు కుటుంబంతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. యర్రగొండపాలెం మండలంలోని అల్లిపాలెం చెంచుగూడెంలో సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవన్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ కార్యక్రమం కింద అనేక అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు. అల్లిపాలెంలో వసతి గృహం లేకపోవడం వలన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. గూడెంలో 74 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారికి పక్కా గృహాలు నిర్మించాలని గంజివారిపల్లె సర్పంచ్ దుగ్గెంపూడి సుబ్బారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అల్లిపాలెం చెంచుగూడెం నుంచి పంచాయతీ కేంద్రమైన గంజివారిపల్లె వరకు 7 కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 40 కుటుంబాలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయించాలన్నారు. గూడెంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బాల ప్రకాశ భవన్‌కు ఉపాధి హామీ పథకం కింద కాంపౌండ్ వాల్ మంజూరు చేయించాలని ఆయన కోరారు. అల్లిపాలెంలో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గూడెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, న్యూట్రి గార్డెన్‌ను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో 24 మంది పిల్లలు ఉన్నారని, వారిలో 9 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేకపోవడం వలన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని సీడీపీవో బి.పద్మ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే గూడెంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆధార్ కార్డు లేనివారి వివరాలు నమోదు చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకటత్రివినాగ్, తహసీల్దార్ బాలకిషోర్, చైల్డ్ బీలీవ్ సంస్థ కంట్రీ డైరెక్టర్ నాని, సార్డ్స్ పీడీ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా సోలార్‌దే

- విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఈఈ హరిబాబు

ఒంగోలు సిటీ: భవిష్యత్ అంతా సోలార్‌దేనని, సోలార్‌తో ఎంతో ఉపయోగం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ కె.హరిబాబు అన్నారు. విద్యుత్ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వారందరికీ సోలార్ విద్యుత్ ప్యానల్ వెసులుబాటు కల్పించాలని, అందుకోసం సోలార్‌కు సబ్సిడీ కేంద్రప్రభుత్వం అందజేస్తుందన్నారు. కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్ లకు రూ.78 వేలు చొప్పున సబ్సిడీ అందజేస్తుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం దిగువ, మధ్య తరగతి నివాస వినియోగదారుల ప్రయోజనం కోసం సౌర విద్యుత్ పథకం ప్రారంభించారని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను నేషనల్ పోర్టల్‌లో http://pmruryafhar.gov.in సమర్పించవచ్చని తెలిపారు. ఆ తరువాత వినియోగదారులు నమోదు చేసుకున్న విక్రయేతల నుంచి సోలార్‌ప్లాంట్‌లు బిగించుకొని నెట్ మీటర్ కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నెట్ మీటర్ అమర్చిన తర్వాత వినియోదారులు పోర్టల్‌లో బ్యాంక్ ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. డివిజన్ పరిధిలో రాజీవ్‌నగర్, క్లోపేట, హౌసింగ్ బోర్డుల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖైదీల మానసిక వికాసానికి ప్రాధాన్యం

- జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి

ఒంగోలు టౌన్: ఖైదీల మానసిక అవసరాలను గుర్తించి మానసిక వైద్యులచే తగిన చికిత్స చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ పి. వరుణారెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం, ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కారాగారంలో ఖైదీలు, సిబ్బందికి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల మానసిక వికాసాన్ని పెంపొందించుకునేలా ప్రతి రోజూ యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. త్వరలోనే మంచి పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వృత్తి నైపుణ్యం పెంచుకునేందుకు ఏర్పాటు చేసే శిక్షణను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆనందం, కోపం, బాధ వంటి భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా , ఆనందంగా జీవించవచ్చని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి చెప్పారు. మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కన్నారు. మానసిక అనారోగ్యంతో గుండెపోటు, సుగర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. మంచి ఆలోచనలు, మంచి ఆలవాట్లు మనిషిని సంపూర్ణ ఆరోగ్యం కలిగిస్తాయని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. క్రీడలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. మెదడు పనితీరులో 80 శాతం కళ్ల పాత్ర ఉంటుందని, ఫోన్లు, కంప్యూటర్లు, టీవీలు ఎక్కువగా చూడడం వలన కళ్లతో పాటుగా మెదడు పనితీరు దెబ్బతింటుందని ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ నళిని తెలిపారు. నిద్రలేమి అన్ని రకాల మానసిక, శారీరక వ్యాధులకు కారణమవుతుందన్నారు. జరిగిన తప్పులను పదే పదే తలచుకోవడం, కోపం తెచ్చుకోవడం లాంటివి మంచిది కాదని, ప్రశాంతంగా జీవించేందుకు యోగా చేయాలని సైకాలజిస్ట్ ఏడుకొండలు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్ కుమార్, సూరిబాబు, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బ్రహ్మతేజ, జైలర్ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షల విలువైన క్రాకర్స్ స్వాధీనం

- ఐదుగురు అరెస్టు



స్వాధీనం చేసుకున్న దీపావళి క్రాకర్స్

మార్కాపురం: పట్టణంలోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి మందులతో పాటు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న క్రాకర్స్‌ను, ఆటోను స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ యు నాగరాజు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సీఐ సుబ్బారావుతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం పట్టణ ఎస్సై సైదుబాబు తన సిబ్బందితో కలిసి ఎస్టేట్ వై జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఉదయం 8 గంటల సమయంలో ఎస్టేట్ వైపు నుంచి మార్కాపురం పట్టణంలో వస్తున్నఆటోను తనిఖీ చేయగా సుమారు రూ.1.50 లక్షల విలువైన దీపావళి క్రాకర్స్‌ను చిలకలూరిపేటలోని లైసెన్సు ఉన్న లక్ష్మీవాసవీ క్రాకర్స్ గోడౌన్ నుంచి తక్కువ ధరకు అధికమొత్తంలో మార్కాపురం పట్టణానికి చెందిన రమాకాంత్ అనే వ్యక్తి కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు ప్రజలకు విక్రయించేందుకు ఆటోలో తీసుకొస్తున్నట్లు డ్రైవర్ బాషా తెలిపాడన్నారు. దీంతో డ్రైవర్ బాషా, ఆటో, అందులో ఉన్న దీపావళి క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్సై సైదుబాబు తనకు వచ్చిన సమాచారం మేరకు ఎస్టేట్‌లోని నరసింహారావు ప్లాస్టిక్ గ్రానువల్స్ పేరుతో ఉన్న గోడౌన్‌లో తనిఖీ చేయగా సుమారు రూ.2 లక్షల విలువైన దీపావళి క్రాకర్స్‌ను చిలకలూరిపేటలోని లైసెన్సు ఉన్న లక్ష్మీ వాసవీ క్రాకర్స్ నుంచి తక్కువ ధరకలు అధిక మొత్తంలో మార్కాపురం పట్టణానికి చెందిన జ్వలిత్ అనే వ్యక్తి కొనుగోలు చేసి తన గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచి ఎక్కువ ధరకు ప్రజలకు విక్రయిస్తున్నట్లు చెప్పాడన్నారు. దీంతో జ్వలిత్‌పై కేసు నమోదు చేసి గోడౌన్ నుంచి దీపావళి క్రాకర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం రూ.3.50 లక్షల విలువైన దీపావళి క్రాకర్స్‌ను స్వాదీనం చేసుకున్నామని, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబులను డీఎస్పీ నాగరాజు అభినందించారు.

మెరుగైన వైద్యం అందించండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఏరియా వైద్యశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

యర్రగొండపాలెం: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక ఏరియా వైద్యశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వైద్యశాల ప్రాంగణంలో లెవలింగ్ లేకపోవడంతో వర్షం నీరు చేరి బురదగా మారుతుందని, కాంపౌండ్ వాల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వైద్యాధికారి యదిద్యా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగా కలెక్టర్ స్థానిక పుల్లలచెరువు రోడ్డులో నిర్మాణాలు పూర్తయిన రైతు బజార్‌ను సందర్శించారు. ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ బాలకిషోర్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఎంసీ ఏడీ ఉపేంద్రకుమార్ ఉన్నారు.

పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



పశుపోషకులకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న జేడీ

సింగరాయకొండ: పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధకశాఖ జేడీ కె.బేబిరాణి అన్నారు. మండలంలోని బింగినపల్లి గ్రామంలో గురువారం ఆమె పశువుల పెంపకందారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. జొన్న గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని, పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. గొర్రెలు, మేకలకు త్వరలో నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. డాక్టర్ హజరత్, వెటర్నరీ అసిస్టెంట్ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు

గిద్దలూరు రూరల్: బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం ముండ్లపాడురోడ్డులోని సగిలేరువాగు బ్రిడ్జి సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..రాచర్ల మండలం సంగపేట గ్రామానికి దేవరాజుగట్టు వెంకటేశ్వర్లు(45), ఆంజనేయులు, గురవయ్యలు ఒకే బైక్‌పై గిద్దలూరు వైపు వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరోవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్వర్లు మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడిన ఆంజనేయులను మెరుగైన నిమిత్తం నంద్యాలకు, గురవయ్యను నర్సరావుపేటకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● టెక్...టాక్



రెడ్ మ్యాజిక్ టైటాన్ 16 ప్రో

రిజల్యూషన్: 2,560×1,600 పిక్సెల్స్
బరువు: 2.4 కేజీ;
రిఫ్రెష్‌రేట్: 240 హెచ్‌జడ్
వోఎస్: విండోస్ 11 హోమ్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్10 ప్లస్



డిస్‌ప్లే: 12.4 అంగుళాలు
మెమరీ: 12జీబి ర్యామ్/256జీబి/512 జీబి స్టోరేజ్
కెమెరా: 13 ఎంపీ మెయిన్/ 8 ఎంపీ ఆల్ట్రా వైడ్/ 12 ఎంపీ ఫ్రంట్
బ్యాటరీ: 10,900 ఎంఏహెచ్



ల్యాప్‌టాప్ మౌంట్ మ్యాగ్-సేఫ్ ఫోన్

బ్రాండ్: ఇన్‌ఎవిట్
కలర్: బ్లాక్; స్పెషల్ ఫీచర్స్: ఆర్మ్
మౌంటింగ్ టైప్: టేబుల్ మౌంట్
బరువు: 100 గ్రా.
ప్రాడక్ట్ డైమెన్షన్స్: 13×5.6×0.5 సీఎం

మొబైల్ అండ్ ట్యాబ్‌లెట్ హోల్డర్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్
కలర్: బ్లాక్
ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
360 డిగ్రీ రొటేషన్ ఫీచర్
కంపాటబుల్ ఫోన్ మోడల్స్: ఆల్ ఫోన్స్

ఇంగ్లీష్ ఇడియమ్స్



ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్

గొడవలు లేదా విభేదాలకు స్వస్తి పలకడానికి సుముఖతకు వ్యక్తం చేయడానికి, స్నేహపూర్వక హస్తాన్ని అందించి సామరస్యం దిశగా అడుగులు వేసేటప్పుడు వాడే మాట...ఎక్స్‌టెండ్ ది ఆలివ్ బ్రాంచ్.

ఉదా: డూరింగ్ నెగోషియన్స్, ఈచ్ సైడ్ టూక్ టర్న్స్ ఎక్స్‌టెండింగ్ ది ఆలివ్ బ్రాంచ్ టు ట్రై అండ్ రీచ్ ఏ కాంప్రమైజ్.

వానిష్ ఇన్ టు ది ఏయిర్

'ఒక్కసారిగా మాయమయ్యాడు' 'ఫైల్స్ ఉన్నట్టుండి మాయం అయ్యాయి'... ఇలా చెప్పే సందర్భంలో వాడే మాట... వానిష్ ఇన్ టు ది ఏయిర్.

ఉదా: మై కీస్ సీమ్ టు హ్యావ్ వానిష్డ్ ఇన్‌టు తిన్ ఏయిర్. ఐ హ్యావ్ సెర్చ్‌డ్ ఎవ్రీవేర్ అండ్ కాంట్ ఫైండ్ దెమ్.

ఇన్‌స్పిరేషన్

రుక్మిణి వారియర్



ఆరో తరగతి ఫెయిలైన అమ్మాయికి 'ఐఏఎస్' కలలు ఉంటాయా? 'సాధ్యం కాదు' అనుకున్నదాన్ని 'సాధ్యం' చేయవచ్చా? ఈ రెండు ప్రశ్నలకు జవాబు చెప్పే పేరు....రుక్మిణి రియర్. ఆరో తరగతి ఫెయిలైన రుక్మిణి తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో రెండో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కమిషనర్‌గా 'ఆఫీసర్ అంటే ఇలా ఉండాలి' అనుకునేలా పనిచేస్తోంది...

స్కూల్ రోజుల్లో రుక్మిణి బ్రైట్ స్టూడెంట్ కాదు. రుక్మిణి ఆరో తరగతి ఫెయిల్ కావడం ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే ఆ ఫెయిల్యూరే తనను సక్సెస్‌కు దగ్గర చేసింది.

'ఫెయిల్యూర్ అంటే మొదలైన భయం ఎలాగైనా సక్సెస్ కావాలనే పట్టుదలను పెంచింది' అంటుంది రుక్మిణి. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్శిటీ'లో సోషల్ సైన్స్‌లో డిగ్రీ చేసిన రుక్మిణి ముంబైలోని 'టాటా ఇనిస్టిట్యూట్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఆ తరువాత ముంబై, మైసూర్‌లలో కొన్ని స్వచ్ఛందసంస్థలలో పనిచేసింది.

స్వచ్ఛంద సంస్థల్లో పనిచేస్తున్న క్రమంలో అంకితభావం, వృత్తినిబద్ధత ఉన్న ఎంతో మంది ఐఏఎస్ అధికారుల గురించి విన్నది. వారి గురించి విన్నప్పుడల్లా 'ఐఏఎస్' వైపు మనసు మళ్లేది. చివరికది అది తన కలగా మారింది. 'ఒక ప్రయత్నం చేసి చూద్దాం' అని రంగంలోకి దిగింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండానే తొలి ప్రయత్నంలోనే యూపీఎస్సీలో ఆల్ ఇండియా ర్యాంక్ 2 సాధించింది. 'ఆరోతరగతి ఫెయిలైన అమ్మాయి ఐఏఎస్ సాధించింది'... రుక్మిణి గురించి ఇలాంటి వార్తలు వైరల్ అయ్యాయి. చాలామంది విద్యార్థులు ఆమెను కలుసుకొని మాట్లాడి సలహాలు తీసుకునేవారు.

కట్ చేస్తే...

ఇప్పుడు రుక్మిణి రియర్ రాజస్థాన్‌లోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ కమిషనర్.

యూపీఎస్సీలో సెకండ్ ర్యాంక్‌తో ఎలా వార్తల్లో నిలిచిందో మున్సిపల్ కమిషనర్‌గా కూడా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. దీనికి కారణం అక్రమార్కుల పాలిట ఆమె సింహస్వప్నం కావడమే. డిసెంబర్‌లో జరగబోయే 'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'ను దృష్టిలో పెట్టుకొని విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. విమానాశ్రయం నుండి 22 గోదాముల వరకు ప్రధాన రోడ్లను పరిశీలిస్తూ వెళ్లింది.

నగర పరిశుభ్రత, సుందరీకరణ గురించి స్థానికులతో మాట్లాడింది. సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చెయ్యాలని, పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఫ్లైవోవర్‌లు మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి పెయింటింగ్, లైటింగ్‌ల కోసం సూచనలు ఇచ్చింది.

గోడలకు పెయింటింగ్ వేయడం నుంచి పబ్లిక్ టాయిలెట్లు, చెత్త కుండీలు శుభ్రం చేయడం వరకు ప్రతి పని దగ్గర ఉండి చేయిస్తుంది. నగర సుందరీకరణతో పాటు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' ద్వారా జైపూర్‌ను గ్లోబల్ సిటీగా ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది. దీని కోసం జైపూర్ అద్భుతంగా కనిపించకపోయినా... పరిశుభ్రంగా, ఆక్రమణలు లేకుండా కనిపించాలి. ఇది అనుకున్నంత సులువైన పనేమీ కాదు. ఎందుకంటే సమ్మిట్‌కు ఎన్నో నెలలు లేదు. అయినా సరే వెనక్కి తగ్గకుండా కష్టపడుతూ ప్రజల నుంచి శభాష్ అనిపించుకుంటోంది రుక్మిణి.

'పని చెయ్యకపోయినా ఫరవా లేదు. చేస్తే మాత్రం శ్రద్ధగా, భక్తిగా చేయాలి' అని అమ్మ అంటుండేది. ఆ మాటలే రుక్మిణి రియర్‌కు వేదవాక్కు.

ఏఐ ఏరియా



మెటా వారి మూవీ జెన్

'మూవీ జెన్' అనే కొత్త ఏఐ మోడల్‌ను రూపొందిస్తున్నట్లు టెక్ దిగ్గజం 'మెటా' ప్రకటించింది. ఇది ప్రాంప్ట్‌లకు స్పందనగా రియలిస్టిక్ వీడియో, ఆడియో క్లిప్‌లను జనరేట్ చేయగలదు. ఓపెన్ ఏఐ, ఎలెవన్ ల్యాబ్స్‌లాంటి ఏఐ వీడియో టూల్స్‌కు ఇది గట్టి పోటీ ఇవ్వగలదని పరిశీలకులు భావిస్తున్నారు. ఓపెన్ ఏఐ తన వీడియో మోడల్ 'సోరా'ను ప్రపంచానికి పరిచయం చేసింది. ఒపెన్ ఏఐ షేర్ చేసిన డెమోలు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టించాయి.

'సోరా' ఇంకా అందుబాటులోకి రానప్పటికీ దాని హైపర్ రియలిస్టిక్ ఫుటేజ్ హాలీవుడ్ స్థాయిలో కనిపించింది. ఈ నేపథ్యంలో 'మూవీ జెన్' గురించిన సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది టెక్స్ట్ ఇన్‌పుట్స్ సహాయంతో వీడియోలను జనరేట్ చేస్తుంది. ఫుటేజ్, స్టిల్ ఇమేజ్‌లను ఎడిట్ చేయగలదు. వీడియోకు జోడించే ఆడియో కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జనరేట్ చేయబడుతుందని, విజువల్‌కు సింక్ అవుతుందని సమాచారం. వివిధ యాస్పెక్ట్ రేషియోలలో వీడియోలను రూపొందించడంతో పాటు వీడియోలకు నిర్దిష్ట సవరణలు చేయగలదు. యూజర్ అందించిన చిత్రాలను ఉపయోగించి పర్సనలైజ్ కంటెంట్‌ను సృష్టించగలదు. టెక్నికల్‌గా చూస్తే...'మూవీ జెన్' అనేది వీడియో జనరేషన్ కోసం 30 బిలియన్ పారామీటర్ మోడల్, ఆడియో కోసం 13 బిలియన్ పారామీటర్ మోడల్‌ను ఉపయోగిస్తుంది.

మెటా మాటల్లో చెప్పాలంటే 'మూవీ జెన్' అనేది అధునాతన ఏఐ వీడియో సృష్టి సాధనం.

● గేమింగ్



ఆయుధాల దండోర

మన దేశంలోని ప్రముఖ గేమింగ్ స్టూడియోలలో ఒకటైన 'అగ్రెమింగ్' తన బ్యాటిల్ రాయల్ గేమ్ 'ఇండస్' లాంచ్ తేదీని ప్రకటించింది. ఈ నెల16 నుంచి గేమ్ సందడి మొదలు కానుంది. ఈ గేమ్ గూగుల్ ప్లేస్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గేమ్‌లోని హీరో లక్ష్యం 'కాస్మియం' అని పిలవబడే అరుదైన వనరును సేకరించడం, తన ప్రత్యర్థి ప్రోత్రాన్‌ను ఎదుర్కోవడం.

'డోన్ట్ వేస్ట్ టైమ్...ఫినిష్ హిమ్' అంటూ వచ్చిన గేమ్ ట్రైలర్ ఆకట్టుకుంది. 'ఇండస్ ద్వారా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయలలోని ప్రత్యేకమైన పాత్రలు, ఆయుధాలను ప్లేయర్స్ ముందుకు తీసుకువస్తున్నాం. బీటా దశలో ప్లేయర్స్ నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌తో గేమ్‌ను మరింత మెరుగు పరిచాం' అంటున్నాడు 'సూపర్‌గేమింగ్' సీయివో రోబీజాన్.

ప్లాట్‌ఫామ్స్: పీసి, మొబైల్, కన్సోల్; **జానర్:** బ్యాటిల్ రాయల్ గేమ్

మ్యూజిక్ వరల్డ్

థీ థీ తారా



'సౌత్ ఇండియన్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఆసక్తి. పాటలు వింటాను. మ్యూజిక్ వీడియోలు చూస్తుంటాను' అంటున్న కొరియన్ ఆర్టిస్ట్ ఔర సింగర్-సాంగ్ రైటర్ శిరీష భాగవతులతో కలిసి 'థీ థీ తారా' (కుట్టనాడన్ డ్రీమ్స్) ఆలపించాడు. గత సంవత్సరం చివరిలో బిగ్‌బాస్ సీజన్ 17లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా కనిపించాడు. ఈ సంవత్సరం ప్రారంభంలో ఝలక్ దిఖ్లా సీజన్ 11లో కూడా కనిపించాడు. ఈ క్రమంలో ఇండియన్ మ్యూజిక్‌పై లవ్ పెంచుకున్నాడు.'ఛలో' 'రోకో'లాంటి పదాలు పలుకుతున్న ఔర హిందీ నేర్చుకోవాలనుకుంటున్నాడు.

'ఔరా ఉచ్చారణ చాలా భిన్నంగా ఉంటుంది. దీని కోసం ఐదు వారల పాటు పనిచేశాడు. అతడి అంకితభావం నాకు ఎంతగానో నచ్చింది' అంటున్న శిరీష ఔరాను మన దేశంలోని ఇంటిపేరుగా అభివర్ణించింది. 'మార్నింగ్ నూన్ ఈవెనింగ్' 'బ్లూ ఒషియన్' 'ఫైర్‌వర్క్'....ఇలాంటి ఎన్నో సింగిల్స్‌తో పేరు తెచ్చుకున్న ఔరా 2014లో బాయ్ బ్యాండ్ ఎఎతో కెరీర్ ప్రారంభించాడు.

సినిమా

నాలుగు దశాబ్దాలు వెనక్కి...


● రాజ్ తరుణ్, సందీప్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'రామ్ భజరంగ్'. సిమ్రత్ కౌర్, సత్నా టైటస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తయ్యింది. దసరా నవరాత్రుల సందర్భంగా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో రాజ్ తరుణ్, సందీప్ డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తారు. ఎందుకంటే దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం సాగే కథలో ఇద్దరూ నటిస్తున్నారు. ''1980 నేపథ్యంలో సాగే ఈ సినిమా మంచి ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నాం' అని చిత్రబృందం పేర్కొంది. ఛాయా దేవి, మనసా రాధాకృష్ణన్, రాజా రవీంద్ర, రవిశంకర్, షఫీ, శివరామరాజు వెంకట్, 'సత్యం' రాజేశ్, ధనరాజ్, 'రచ్చ' రవి, ఐశ్వర్య ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: మణిశర్మ, కెమెరా: అజయ్ విన్సెంట్.


● అజిత్

సంక్రాంతి బరిలోనే...

అజిత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్‌లో జరుగుతోంది. ఈ లాంగ్ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్, సాంగ్ చిత్రీకరణలను కూడా ప్లాన్ చేశారు. ఈ చిత్రంలో సునీల్, ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలాగే ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారని, హీరోయిన్ శ్రీలీల మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారనే ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికి విడుదల కానుంది. అయితే ఈ సినిమాకన్నా ముందే అజిత్ హీరోగా కమిటైన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలతుందని, 'గుడ్ బ్యాడ్ అగ్లీ' వచ్చే వేసవిలో రిలీజ్ కానుందనే ప్రచారం తెరపైకి వచ్చింది. కానీ తాజాగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సంక్రాంతికే రిలీజ్ అవుతుందని వెల్లడించి, అజిత్ కొత్త లుక్‌ను యూనిట్ రిలీజ్ చేసింది. దీంతో 'విడాముయర్చి' చిత్రం వచ్చే వేసవిలో రిలీజ్ అవుతుందని ఊహించవచ్చు.

ఓటీటీ ఇది చూడొచ్చు

బిడ్డ కోసం పోరాడిన ఓ కన్నతల్లి కథ

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'కిడ్నాప్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.


● 'కిడ్నాప్' పోస్టర్

ప్రపంచంలో తల్లి ప్రేమకు సాటి ఏదీ లేదని అంటారు. తన బిడ్డకు ఆపద వస్తే తన ప్రాణాన్ని పణంగా పెట్టైనా పోరాడే తత్వం తల్లిది అన్న విషయాన్ని సూటిగా చూపించిన ఆంగ్ల చిత్రం 'కిడ్నాప్'. 2017లో లూయి ప్రీటో దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలందుకుంది. హాలీవుడ్ ప్రముఖ కథానాయిక హేలీ బెర్రీ ప్రధాన పాత్రలో నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ (ఇంగ్లిష్), లయన్స్ గేట్ (తెలుగు వెర్షన్) ఓటీటీల్లో స్ట్రీమ్ అవుతోంది. తల్లిగా ఆమె నటన ఈ సినిమా మొత్తానికే హైలైట్. కథాంశానికొస్తే... కార్లా డైసన్ ఓ సింగిల్ మదర్. తన ఆరేళ్ల కొడుకు ఫ్రాంకీని కార్నివాల్‌కు తీసుకువెళ్ళడంతో 'కిడ్నాప్' సినిమా మొదలవుతుంది. కార్నివాల్‌లో అనుకోకుండా పార్కింగ్ లాట్ నుండి తన కొడుకును ఎవరో ఎత్తుకెళ్లడం చూస్తుంది కార్లా. ఇక అక్కడి నుండి ఆ కిడ్నాపర్ల వెంటపడి తన కొడుకును ఎలా కాపాడుకుంటుంది అన్నదే మిగతా కథ. ఈ సినిమా స్క్రీన్‌ప్లే దాదావు రోడ్డు మార్గానే నడుస్తుంది. అమెరికా రోడ్లలో పరిమితికి మించి వేగంగా కొంతమంది కార్లు నడుపుతూ ఉంటారు. అంతకు మించి వేగంగా ఈ కథ స్క్రీన్‌ప్లే ఉంటుంది. కుర్చీలో కూర్చున్న ప్రేక్షకులు ఈ సినిమా మొదలయ్యాక శుభం కార్డు పడే వరకు లేవరు. సినిమాను అంత ఆసక్తికరంగా దర్శకుడు లూయీ రూపొందించారనడంలో అతిశయోక్తి లేదు. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తీశారు. ప్రఖ్యాత సంస్థ అయిన ఎఫ్‌బీఐ ఇచ్చిన అంచనాల మేరకు అమెరికాలో ఏటా 8 లక్షలకు పైబడి ప్రతి 40 సెకన్లకు ఓ బిడ్డ కనిపించకుండాపోతున్న పరిస్థితి ఉంది. మనందరినీ మనకి తెలిసీ తెలియకుండా నిరంతరం కాపాడే అమ్మ ఆ విజయదుర్గ. ఆ తల్లి తత్వంతో తీసిన ఈ సినిమా నిజంగా అద్భుతం. విజయదశమి పండగ సమయంలో థ్రిల్లర్ జోనర్ ఇష్టపడే వాళ్లకి ఇదో మంచి చాయిస్.

– ఇంటూరు హరికృష్ణ

పవర్‌ఫుల్ ఝాన్సీ


● లక్ష్మీ రాయ్

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురు ప్రసాద్ దర్శకత్వం వహించారు. తమిళ, కన్నడ భాషల్లో ఆల్రెడీ విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకాదరణ దక్కిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా తెలుగు హక్కులను ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ''ప్రేమ, యాక్షన్ అంశాలతో రూపొందిన సినిమా ఇది. మూడు వేరియేషన్స్ ఉన్న పాత్రలో లక్ష్మీ రాయ్ అద్భుతంగా నటించారు. డ్రగ్స్ సప్లై చేస్తూ కాలేజీ అమ్మాయిల జీవితాలతో ఆడుకునే ఓ ముఠా ఆటను అడ్డుకునే పవర్‌ఫుల్ ఝాన్సీ పాత్రలో లక్ష్మీ రాయ్ నటించారు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. త్వరలోనే ట్రైలర్‌ను రిలీజ్ చేసి, సినిమాను నవంబరులో రిలీజ్ చేస్తాం'' అని ప్రతాని రామకృష్ణ గౌడ్ అన్నారు.

మహాకాళి

ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో


● మహాకాళి పోస్టర్

దర్శక-నిర్మాత-కథారచయిత ప్రశాంత్ వర్మ నేతృత్వంలోని 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' నుంచి రానున్న కొత్త చిత్రానికి 'మహాకాళి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ సినిమాను నిర్మించనున్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కథ, స్క్రీన్‌ప్లేతో దర్శకురాలు పూజా అపర్ణ కొల్లూరు ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం 'మహాకాళి' సినిమాను ప్రకటించి, ఈ సినిమా పోస్టర్, గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''భారతదేశం నుంచి వస్తున్న ఫస్ట్ ఫిమేల్ సూపర్ హీరో ఫిల్మ్ 'మహాకాళి'. మా యూనివర్స్‌లో మోస్ట్ ఫిరోషియస్ సూపర్ హీరో మూవీ. బెంగాల్ నేపథ్యంలో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలతో ఈ సినిమా ఉంటుంది. భారతీయ మహిళల వైవిధ్యాన్ని, వారి అచంచలమైన స్ఫూర్తిని సెలబ్రేట్ చేసుకునేలా ఈ చిత్రం ఉంటుంది. సాధికారత, విశ్వాసం, అద్భుతమైన ప్రయాణం వంటి అంశాలను ప్రతిబింబిస్తుంది. కాళీ దేవి ఉగ్రరూపం, దయగల స్వభావం ఈ సినిమాలో కనిపిస్తాయి. ఈ సినిమాలోని నటీనటులు, సాంకేతిక నిపుణులను త్వరలో వెల్లడిస్తాం. భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఐమాక్స్ 3డీ వెర్షన్ రిలీజ్ కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: స్మరణ్ సాయి.

కామెడీ డ్రామా షురూ


● రానా, టీనా శ్రావ్య, తిరువీర్

తిరువీర్ హీరోగా నటించనున్న కొత్త చిత్రానికి 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటించనున్నారు. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అష్మితా రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సందీప్ అగరం కెమెరా స్విచ్చాన్ చేయగా హీరో-నిర్మాత రానా దగ్గుబాటి క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీనివాస్ గౌరవ దర్శకత్వం వహించారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు రాహుల్ మాట్లాడుతూ– ''కామెడీ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. నవంబరు 7న వైజాగ్, ఎస్. కోట లొకేషన్స్‌లో ఈ మూవీ షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు. ''ఓ కొత్త పాయింట్‌తో రాహుల్ ఈ సినిమా కథను చెప్పనున్నారు'' అని పేర్కొన్నారు నిర్మాతలు సందీప్ – అష్మిత. రోహన్ రాయ్, నరేంద్ర ఇతర కీలక పాత్రల్లో నటించనున్న ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్.

పాంచ్ పటాకా


● మహేశ్ రెడ్డి, రామ్ నందా

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ అనే నూతన నిర్మాణ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. ఎంట్రీ ఇవ్వడమే పాంచ్ పటాకాలా ఐదు సినిమాలు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్ లోగో, మోషన్ పోస్టర్‌ను ప్రముఖ వ్యాపారవేత్త మహేశ్ రెడ్డి లాంచ్ చేశారు. హిమ నందా గజా సమర్పణలో రామ్ నందా దర్శక, నిర్మాతగా హెచ్ఎస్ క్యూబ్ ప్రొడక్షన్‌లో వరుసగా ఐదు చిత్రాలు రానున్నాయి. ఈ ప్రొడక్షన్ లాంచ్ కార్యక్రమంలో రామ్ నందా మాట్లాడుతూ– ''రియల్ ఎస్టేట్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చాను. 2002 నుంచి సినిమా రంగంలో ఉన్నాను. నా కుటుంబం మొత్తాన్ని సూచించేలా హెచ్ఎస్ క్యూబ్ లోగోని నేనే రూపొందించాను. ప్రస్తుతం మా ప్రొడక్షన్ నుంచి ఐదు చిత్రాలు (ప్రేమలు- పెళ్లిళ్ల, మనసు, ఎల్ఎస్ఎల్ఎమ్, గతి, రామున్ని నేనే- రావణున్ని నేనే) రానున్నాయి. అన్ని చిత్రాల కథలు సిద్ధంగా ఉన్నాయి. ఐదు సినిమాలు ఒకేసారి చేసేంత డబ్బు లేదు. ఒక సినిమా తర్వాత ఇంకోటి చేస్తాను. 'ప్రేమలు-పెళ్లిళ్ల'ని ముందుగా సెట్స్ మీదకు తీసుకొస్తాను. ఇందులో కొత్తవారు నటిస్తారు'' అన్నారు.

ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్


● నేహా, రాహుల్

'రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజా బంద్'. అశోక్ రెడ్డి కడదూరి దర్శకత్వం వహిస్తున్నారు. 'డియర్ మేఘ, 'భాగ్ సాలే' వంటి వైవిధ్యమైన సినిమాలు నిర్మించిన వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్‌పై అర్జున్ దాస్యన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని హీరో-నిర్మాత రానా దగ్గుబాటి విడుదల చేసి, 'టైటిల్ ఆసక్తిగా ఉంది... సినిమా సక్సెస్ అవ్వాలి'' అని ఆకాంక్షించారు. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా అశోక్ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. నూతన దర్శకుడైనా అనుభవం ఉన్నవాడిలా తీర్చిదిద్దుతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. అజయ్ ఘోష్, మురళీధర్ గౌడ్, గెటప్ శ్రీను, రచ్చ రవి, రవి వర్మ, గంగవ్వ, జయశ్రీ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి కెమెరా: కార్తీక్ కొప్పెర, సంగీతం: సురేష్ బొబ్బిలి.